

**ఊపిరి భారమై..**
**ప్రాణం పోరాడుతోంది.**


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..








సంపుటి - 2 సంచిక -356 శనివారం 9 మే 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# దేశం గర్వించేలా కొడంగల్ అభివృద్ధి



**కొడంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తా**

**430 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన**

**మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం**

**కొండంగల్‌లో పలు అభివృద్ధి పనులకు సిఎం రేవంత్ శంకుస్థాపనలు**




**కొడంగల్ మే 8 (జర్నలిస్ట్ వార్త):**
దేశం మొత్తం కొడంగల్ వైపు చూసేలా అభివృద్ధి చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొడంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామని ఉద్ఘాటించారు. అందరి సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడుపుతున్నామని తెలిపారు. పేదల సంక్షేమం కోసం తాము పనిచేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. శుక్రవారం వికారాబాద్ జిల్లాలోని సొంత నియోజకవర్గం కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. 430 పడకల ఆస్పత్రి నిర్మాణం, దౌల్తాబాద్ వేంకటేశ్వర ఆలయం, కోస్గి వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, పలువురు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్ శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం చేయటం అదృష్టమని చెప్పుకొచ్చారు. తెలంగాణ పేదల తిరుపతిగా ఈ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఓవైపు గుడి.. మరోవైపు గడి ఏకమైన ఈ నియోజకవర్గాన్ని నందనవనంగా మార్చటానికి అందరు కలిసి రావటం**మిగతాది** 2లో...

# బెంగాల్ రాజకీయాల్లో బిజెపి శకం

**రాష్ట్ర సిఎంగా సువేందు అధికారి -శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నిక**

**అమిత్ షా సమక్షంలో ఎమ్మెల్యేల భేటీ -నేడు సిఎంగా సువేందు ప్రమాణ కార్యక్రమం**

**ప్రధాని మోడీ, అమిత్ షా, తదితర దిగ్గజాల హాజరు**



**కోల్‌కతా, మే 8 (జర్నలిస్ట్ వార్త):**
పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కొత్త శకం మొదలైంది. రాష్ట్రంలో తొలి బీజేపీ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి పగ్గాలు చేపట్టనున్నారు. శుక్రవారం కోల్‌కతాలోని బిశ్వ బంగ్లా కన్వెన్షన్ సెంటర్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో జరిగిన బీజేపీ శాసనసభా పక్ష సమావేశంలో సువేందు అధికారిని శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం ఉదయం 11:00 గంటలకు కోల్‌కతాలోని చరిత్రాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో **మిగతాది** 2లో...

# పోలీస్ అధికారి భార్య హత్య

**జూబ్లీహిల్స్ ప్రశాసన్ నగర్‌లో దారుణం**

**విశ్రాంత పోలీస్ అధికారి వినయ్ రంజన్ సతీమణి హత్య**

**ఇంటి పనిమనిషి కల్పనే సూత్రధారి**



**హైదరాబాద్ మే 8 (జర్నలిస్ట్ వార్త):**
జూబ్లీహిల్స్‌లోని ప్రశాసన్ నగర్‌లో దారుణ హత్య జరిగింది. విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రాయ్ సతీమణి తనూజ (55) హత్యకు గురయ్యారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి నివాసంలో పని చేస్తున్న నేపాల్‌కు చెందిన పని మనిషి కల్పన ఈ హత్యలో కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. పోలీసుల అనుమానం ప్రకారం, కల్పన మరో ముగ్గురితో కలిసి ముందస్తు ప్రణాళికతో హత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది.**మిగతాది** 2లో...

# వీడని సస్పెన్స్!

## కొత్త ప్రభుత్వ ఏర్పాటులో తొలగని అనిశ్చితి..

**అనేక నాటకీయ పరిణామాలు**

**గవర్నర్ అర్లీకర్‌తో విజయ్ సమావేశం..**

**120 మంది బలాన్ని చూపెట్టిన దళపతి**

**విసికె నుండి లేఖ అందలేదని అభ్యంతరం**

**నేడు విజయ్ ప్రమాణ స్వీకారంపై సందిగ్ధం**

**మద్దతు ప్రకటించిన వామపక్షాలు**

**ప్రభుత్వంలో చేరబోమని ప్రకటన**



**చెన్నై మే 8 (జర్నలిస్ట్ వార్త):**
తమిళనాడులో కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై సస్పెన్స్ వీడటం లేదు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు చేస్తున్న ప్రయత్నాలకు అనేక రూపాల్లో అడ్డంకులు ఏర్పడుతున్నాయి. ప్రభుత్వ ఏర్పాటుకు తమను **మిగతాది** 2లో...

# రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు

**నగరంలో వరుస హత్యలు ఆందోళనకరం**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు**



**హైదరాబాద్ మే 8 (జర్నలిస్ట్ వార్త):**
రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో శాంతిభద్రతలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా వరుసగా జరుగుతున్న ఘోరమైన నేరాల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పోలీస్ యంత్రాంగం మొత్తాన్ని రాజకీయ కక్షసాధింపులు, ప్రతిపక్ష నాయకులను వేధించడం కోసమే మళ్లించడం వల్లనే, ప్రజల రక్షణ, భద్రత గాలిలో కలిసిపోయిందని విమర్శించారు. శాంతిభద్రతల క్షీణతపై బీఆర్ఎస్ **మిగతాది** 2లో...

# ఉన్నత విద్యకు వెళ్లే వారికి అండ

**పావలా వడ్డీకే రుణాలు అందించేలా చర్యలు**

**కలక్టర్ల సమావేశంలో సిఎం చంద్రబాబు ఆదేశాలు**






# కిడ్నీ రోగులకు అండగా ప్రభుత్వం

**రాష్ట్రంలో కొత్తగా 12 డయాలసిస్ కేంద్రాలు**

**వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**

# తుమ్మిడిహెట్టి కట్టి తీరుతాం

**ఆర్థిక ఇబ్బందులున్నా పూర్తిచేస్తాం**

**మహారాష్ట్రను ఒప్పించే బాధ్యత (బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలదే**

**స్వలాభం కోసమే కేసీఆర్ కాళేశ్వరానికి(ప్రాజెక్టు తరలింపు**

**ఎక్సైజ్, పర్యాటక శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు**

**మంత్రి గడ్డం వివేక్, ఎమ్మెల్యేలతో కలిసి 'ప్రాణహిత' నిర్మిత స్థల సందర్శన**



**కాగజ్‌నగర్ మే 8 (జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ను కట్టి తీరుతామని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామం వద్ద ప్రాణహిత ప్రాజెక్టు నిర్మిత స్థలాన్ని శుక్రవారం గనులు, కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్, ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్, సిర్పూరు, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు పాల్వాయి హరీష్‌బాబు, గడ్డం వినోద్‌తో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ 150 మీటర్ల ఎత్తుతో బరాజ్ నిర్మిస్తేనే గ్రావిటీ ద్వారా రోజుకు రెండు టీఎంసీల చొప్పున 22 వేల క్యూసెక్కుల నీటిని తరలించొచ్చని చెప్పారు. ఈ బరాజ్ నిర్మాణానికి మహారాష్ట్రలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని ఒప్పించే బాధ్యత తెలంగాణలోని

# దేశం గర్వించేలా కొడంగల్ అభివృద్ధి

**(మొదటి పేజి తరువాయి)**

అభినందనీయమని తెలిపారు. ఆగమశాస్త్ర పండితుడు సుందరవరదాచార్యులు కలలుగన్న గుడి నిర్మాణం సహకారం కావటం సంతోషమని చెప్పారు. తిరుపతిలో ఏ రకమైన పూజలు జరుగుతాయో ఇక్కడ అలాగే పూజలు జరుగుతాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ గుడికి కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు వస్తారని.. దీంతో కొడంగల్‌కు దేశంలో గుర్తింపు వస్తోందని తెలిపారు. కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకానికి భూసేకరణ పూర్తయిందని తెలిపారు ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి నిధుల కొరత లేదన్నారు. ఈ ఎత్తిపోతల పథకానికి భూసేకరణ పూర్తయిందని.. అనుమతులు వచ్చాయని, ఏడాదిన్నరలోపు పూర్తి చేద్దామని చెప్పుకొచ్చారు. కృష్ణానదీ జలాలతో కొడంగల్ భూములు తడవాలన్నారు. కృష్ణా జలాలు ఇక్కడికి వచ్చే వరకు జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రి శ్రీహరిని నిద్ర పోనీయొద్దని స్థానిక నేతలకు సూచించారు. కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ నియోజకవర్గానికి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా మంత్రి పదవి దక్కలేదని, ఇప్పుడు కొడంగల్ ఎమ్మెల్యేనైన తనకు సీఎం పదవి దక్కిందన్నారు. కొడంగల్ నుంచే దౌల్తాబాద్, కోస్గి ఆలయాల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు.కృష్ణ- వికారాబాద్ రైల్వేలైన్ త్వరలో పూర్తవుతుందని స్పష్టం చేశారు. రేకులపాడు ప్రాంతంలో సిమెంట్ పరిశ్రమలను ఆరు నెలల్లో ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామని అన్నారు. 20 ఎకరాల్లో లగచర్ల వద్ద విద్యాహబ్‌గా మార్చుతున్నామని సీఎం ఉద్ఘాటించారు. ఇక్కడ అనేక విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. రాజకీయాలు ఎన్నికల సమయంలో ఉండాలని.. ఆ తర్వాత అందరం కలిసి పనిచేయాలని సూచించారు. 2034 వరకు గుంపులు, గ్రూపులు పక్కన పెట్టాలని.. అభివృద్ధికి బాటలు వేద్దామని పిలుపునిచ్చారు. కొడంగల్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకుందామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# పోలీస్ అధికారి భార్య హత్య

**(మొదటి పేజి తరువాయి)**

తనూజ ఒంటరిగా ఉన్న విషయాన్ని తన గ్యాంగ్‌కు చెప్పిన కల్పన గురువారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో వారితో కలిసి హత్యకు పాల్పడినట్లు సమాచారం. హత్య అనంతరం ఇంట్లో ఉన్న బంగారం, నగదు తీసుకుని నిందితులు పరారైనట్లు పోలీసులు భావిస్తున్నారు. కాగా, 8 నెలలుగా ఆ ఇంట్లో కల్పన పని చేస్తోంది. మరోవైపు ఘటనాస్థలికి ఉన్నతాధికారులు చేరుకుని పరిశీలించారు. కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న పోలీసులు నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల నివాస ప్రాంతంలో హత్య జరగడం సంచలనంగా మారింది. హత్య విషయం తెలిసిన వెంటనే రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఇంటికి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ చేరుకున్నారు. కాగా, వినయ్ రంజన్ రాయ్ ప్రస్తుతం బెంగళూరులో ఉన్నట్లు తెలుస్తోంది.

-------------

# కిడ్నీ రోగులకు అండగా ప్రభుత్వం

## రాష్ట్రంలో కొత్తగా 12 డయాలసిస్ కేంద్రాలు

## వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

**అమరావతి మే 8 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో కిడ్నీ సమస్యలతో ఇబ్బంది పడుతున్న రోగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. శుక్రవారం రాజధాని అమరావతిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొత్తగా 12 డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రైవేట్ ఏజెన్సీకి టెండర్ ద్వారా వీటి నిర్వహణ చేపడతాయని తెలిపారు. ఇప్పటికే కూటమి పాలనలో 12 డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేశామని ఆయన గుర్తు చేశారు. అదనపు డయాలసిస్ కేంద్రాలతో కలిపి మొత్తం 73 కిడ్నీ సమస్యతో ఇబ్బంది పడుతున్నవారికి అందుబాటులోకి వచ్చాయని మంత్రి సత్యకుమార్ వివరించారు. 'ప్రైమ్ మినిస్టర్ నేషనల్ డయాలసిస్ ప్రోగ్రాం' కింద రాష్ట్రంలోని సెకండరీ ఆసుపత్రుల్లో 61 కేంద్రాలు నడుస్తున్నాయని వివరించారు. వీటికి అదనంగా ఈ 12 కేంద్రాలు వస్తున్నాయని తెలిపారు. కొత్త కేంద్రాల రాకతో దూర ప్రాంతాలకు వెళ్లి రక్త శుద్ధి చేయించుకునే రోగులకు అవస్థలు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సేవలు పూర్తిగా ఉచితమని తెలిపారు. ఈ కేంద్రాల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం ఐదేళ్లకు కలిపి సుమారు రూ.30 కోట్ల వరకు ఖర్చు చేస్తుందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ వివరించారు. ఇక ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 2,721పైగా డయాలసిస్ మిషన్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 985 మిషన్లు, నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో 1,736 డయాలసిస్ మిషన్లు ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 21,504 మంది కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులు ఉన్నారు.

# ఉన్నత విద్యకు వెళ్లే వారికి అండ

## పావలా వడ్డీకే రుణాలు అందించేలా చర్యలు

## కలక్టర్ల సమావేశంలో సిఎం చంద్రబాబు ఆదేశాలు

**అమరావతి మే 8 (జర్నలిస్ట్ వార్త):**

దేశ విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసానికి వెళ్లే విద్యార్థులకు పావలా వడ్డీకే విద్య రుణాలు అందించాలని జిల్లా కలెక్టర్లను సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. విద్యార్థుల ఉన్నత విద్యను ప్రోత్సహించడమే లక్ష్యమని అన్నారు. చాలామంది రుణాలు అందక చదువుకలేక పోతున్నారని, అలాంటి వారికి అండగా నిలవాల్సి ఉందన్నారు. శుక్రవారం రాజధాని అమరావతిలో జిల్లా కలెక్టర్ల సమావేశంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సీఎం చంద్రబాబు కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలతోపాటు తల్లికి వందనం, సంక్షేమంపై అధికారులకు సీఎం చంద్రబాబు సూచనలు చేశారు. అలాగే పథకాల అమలు, లబ్దిదారుల ఇంటిగ్రేషన్‌పై వారికి సీఎం దిశానిర్దేశర చేశారు. అన్నదాత సుఖీభవ, దీపం 2.0, స్త్రీ శక్తి, దివ్యాంగశక్తి పథకాలపై చర్చించారు. దీపం-2.0 పథకం కింద 1.08 కోట్ల మంది లబ్దిదారులు ఉన్నారని తెలిపారు. దీపం-2.0 పథకానికి ఇప్పటి వరకు రూ.3,504 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. స్త్రీ శక్తి కోసం ఏడాదికి రూ.1,940 కోట్ల ఖర్చు అవుతుందని చెప్పారు. తల్లికి వందనం కింద 67 లక్షల మందికి రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. ఏజెన్సీల్లో కాఫీ, పసుపు, కుంకుమపువ్వు సాగుకు ప్రోత్సాహం ఇస్తున్నట్లు ప్రకటించారు. అరకు కాఫీకి గ్లోబల్ బ్రాండ్ తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. జిల్లా కలెక్టర్‌ల సమావేశం గురువారం రాజధాని అమరావతిలో ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశం సాయంత్రం ముగిసింది.

# తుమ్మిడిహెట్టి కట్టి తీరుతాం

**(మొదటి పేజి తరువాయి)**

8 మంది బీజేపీ ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలు తీసుకోవాలని సూచించారు. 2008లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.35వేల కోట్లు కేటాయించి, అందులో రూ.13వేల కోట్లతో కాలువల నిర్మాణం చేపట్టిందని వివరించారు. మరో రూ.20వేల కోట్లు వెచ్చిస్తే బరాజ్ నిర్మాణం పూర్తయ్యేదని, కానీ కేసీఆర్ సొంత లాభం కోసం దీన్ని ఇక్కడి నుంచి తరలించారని ఆరోపించారు.

కాసుల కోసమే కేసీఆర్ ఈ ప్రాజెక్టు ను కాళేశ్వరానికి తరలించి ఈ ప్రాంత రైతాంగానికి తీవ్ర అన్యాయం చేశారని మంత్రి వివేక్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిర్పూరు, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూరు నియోజకవర్గ రైతుల కోసం ఈ ప్రాజెక్టు కట్టి తీరుతామని చెప్పారు. దీనికి ముందు బరాజ్ నిర్మాణ స్థలాన్ని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ పరిశీలించారు. బరాజ్ నిర్మాణం, నీటి నిల్వ సామర్థ్యం గురించి ఇరిగేషన్ సీఈ సత్యరాజచంద్ర, ఈఈ ప్రభాకర్, డీఈలు వెంకటరమణ, తిరుపతి, భద్రయ్య ఆర్వి అసోసియేట్స్ ప్రయివేట్ లిమిటెడ్ ప్రతినిధి ఎంవివి సారధి మంత్రులకు, ఎమ్మెల్యేలకు వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.హరిత, ఎస్పీ నికితాపంత్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.బరాజ్ ఎత్తు నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించే విషయంలో సిర్పూరు బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడాలని ఇద్దరు మంత్రులు కోరినా ఆయన నోరు మెదపలేదు.

150 మీటర్ల ఎత్తుతో బరాజ్ నిర్మాణం కోసం మహారాష్ట్రలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని ఒప్పించే బాధ్యతను తెలంగాణలోని బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు తీసుకోవాలని, దీనిపై స్పందించాలని అక్కడే ఉన్న హరీష్‌బాబును పదే పదే కోరినా ఆయన మాట్లాడడానికి నిరాకరించారు.

# రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు

**(మొదటి పేజి తరువాయి)**

ప్రతినిధి బృందం డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తున్న సమయంలోనే అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే హైదరాబాద్‌లోని ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ ర్యాంక్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రాయ్ భార్య అత్యంత దారుణంగా హత్యకు గురైన వార్త రావడం దిగ్భ్రాంతికరమని పేర్కొన్నారు. అంతేకాకుండా, నిన్న రాత్రి సికింద్రాబాద్‌లో నడిరోడ్డుపై ఒక యువకుడిని అతి దారుణంగా కత్తితో పొడిచి చంపిన ఘటన నగరాన్ని ఉలిక్కిపడేలా చేసిందని, ఇది సామాన్య పౌరుల్లో పెరుగుతున్న అభద్రతా భావానికి అద్దం పడుతోందని స్పష్టం చేశారు. నేరాల నివారణ, ప్రజా భద్రతపై దృష్టి పెట్టాల్సిన పోలీస్, ఇంటెలిజెన్స్ వ్యవస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ తీరును విమర్శించే సోషల్ మీడియా గొంతులపై అక్రమ కేసులు బనాయించేందుకు వాడుకుంటోందని ఆరోపించారు. 'పోలీస్ వ్యవస్థను రాజకీయ కక్షసాధింపు చర్యలకు వాడుకోవడం వల్లనే శాంతిభద్రతలు కుప్పకూలాయని' స్పష్టం చేశారు. తెలంగాణలో మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలు భారీగా పెరిగినట్లు తాజా ఎన్‌సీఆర్‌బీ నివేదికలు చెబుతున్నాయని, ఇది ప్రస్తుత ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని కేటీఆర్ గుర్తుచేశారు. హోం శాఖను కూడా తన వద్దే ఉంచుకున్న రేవంత్ రెడ్డి ప్రజల ఆస్తిపాస్తులను, ప్రాణాలను రక్షించడంలోనూ, శాంతిభద్రతలను కాపాడటంలోనూ ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రాజకీయ వేధింపులు ఆపి, పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని, ప్రజల్లో భరోసా కల్పించేలా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు.

### సిరిసిల్ల జిల్లాలో కెటిఆర్ పర్యటన

### ముల్యాల పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం సిరిసిల్లా జిల్లాలోని పలు మండలాల్లో పర్యటించారు. గంభీరావుపేట మండలం లింగన్నపేటలో ముత్యాల పోచమ్మ ఆలయానికి వచ్చిన సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్లారెడ్డి పేట మండలంలోని నారాయణపూర్, రాగట్ల పల్లె లో పెద్దమ్మ ఆలయాన్ని దర్శించుకున్నారు. శ్రీ మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవంలో పాల్గొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు



చేశారు. దుమాలలోని శ్రీదేవి, భూ దేవి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్థిర ప్రతిష్ట మహోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ త్వరగా వానలు కురవాలి. పంటలు బాగా పండాలి. పాడిపంటలు సమృద్ధిగా పండి రైతులు బాగుండాలి. గ్రామాలు బాగుంటేనే దేశం రాష్ట్రం బాగుంటుందని అన్నారు వీర్నపల్లి మండలం భావిసింగ్ భూక్యా తండాకు చేరుకున్న మాజీ మంత్రి కేటీఆర్ జగదాంబ మాత సేవ లాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్నారు.

# బెంగాల్ రాజకీయాల్లో బిజెపి శకం

**(మొదటి పేజి తరువాయి)**

ప్రమాణస్వీకార కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, బీజేపీ జాతీయ నేతలు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. పాలనలో సమతుల్యత కోసం ఇద్దరు ఉపముఖ్యమంత్రులను నియమించాలని బీజేపీ హైకమాండ్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ ఒక డిప్యూటీ సీఎం పదవిని మహిళా నేత బహుశా అగ్నిమిత్ర పాల్‌కు కేటాయించే అవకాశం ఉంది. ప్రాంతీయ సమీకరణలు దృష్టిలో పెట్టుకుని ఉత్తర బెంగాల్, గిరిజన ప్రాంతాలకు కేబినెట్‌లో పెద్దపీట వేయనున్నారని సమాచారం.తమిళనాడులో విజయ్ లాగే సువేందు అధికారి కూడా ఈ ఎన్నికల్లో రెండు చోట్ల భవానీపూర్, నందిగ్రామ్ పోటీ చేసి రెండింటిలోనూ ఘనవిజయం సాధించారు. ముఖ్యంగా భవానీపూర్‌లో మమతా బెనర్జీపై 15,000 పైచిలుకు ఓట్ల మెజారిటీతో గెలిచి 'జెయింట్ కిల్లర్'గా నిలిచారు. 294 స్థానాలున్న బెంగాల్ అసెంబ్లీలో బీజేపీ 207 స్థానాలు గెలుచుకుని స్పష్టమైన మెజారిటీని సాధించింది. టీఎంసీ 80 స్థానాలకే పరిమితమైంది. ఉదయం జరగనున్న ఈ కార్యక్రమం ద్వారా బెంగాల్ గడ్డపై కమల దళం అధికారికంగా పాలనను ప్రారంభించనుంది. సువేందు 1970 డిసెంబరు 15న తూర్పు మేదినీపూర్‌లోని కర్కులీలో జన్మించారు. ఎంఏ చదివారు. ఆయనది రాజకీయ నేపథ్యమున్న కుటుంబం. తండ్రి సిసిర్ అధికారి ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేశారు. యూపీఏ హయాంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రిగానూ ఉన్నారు. సువేందు 1995లో తొలిసారి కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్‌గా గెలిచారు. 1998లో తండ్రితో కలిసి టీఎంసీలో చేరారు. సువేందు 2006-09 మధ్య రాజకీయాల్లో బాగా ఎదిగారు. 2006లో తొలిసారి కొంటాయీ (దక్షిణ) నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచారు. అదే ఏడాది కొంటాయీ మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్‌గానూ బాధ్యతలు చేపట్టి.. మూడేళ్లు ఆ పదవిలో కొనసాగారు. సువేందు రాజకీయ జీవితంలో 2007 నాటి నందిగ్రామ్ ఉద్యమానిది ప్రత్యేక పాత్ర. నందిగ్రామ్‌లో 10 వేల ఎకరాలు సమీకరించి సెజ్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్రంలోని అప్పటి వామపక్ష ప్రభుత్వం భావించింది. దానికి వ్యతిరేకంగా తృణమూల్ పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టింది. వాటిని సువేందు ముందుండి నడిపించారు. నందిగ్రామ్ ఉద్యమం విజయవంతం కావడంతో.. జంగల్ మహల్ (పశ్చిమ మేదినీపూర్, పురూలియా, బాంకురా జిల్లాలు) ప్రాంతానికి తృణమూల్ ఇంఛార్జిగా సువేందును మమత నియమించారు. మమతకు అత్యంత సన్నిహిత నేతల్లో ఒకరిగా ఎదిగారు. సువేందు 2009లో తమ్లుక్ స్థానం లోక్‌సభ ఎంపీగా గెలిచి జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2016లో నందిగ్రామ్ ఎమ్మెల్యేగా విజయం సాధించి.. మమత సర్కారులో మంత్రి పదవి చేపట్టారు. తృణమూల్ వ్యవస్థాపక సభ్యుడైన ముకుల్ రాయ్ 2017లో పార్టీని వీడారు. అప్పటి నుంచి తృణమూల్‌లో సువేందు ప్రభావం మరింత పెరిగింది. పార్టీలో మమత తర్వాత నంబర్-2 ఈయనేనని అంతా అనుకున్నారు. అయితే క్రమంగా పరిస్థితులు మారిపోయాయి. మమత తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీకి పార్టీలో అధిక ప్రాధాన్యమివ్వడం, ఆయనకే పార్టీ పగ్గాలు అప్పగించేలా కనిపించడం సువేందుకు రుచించలేదు. అప్పటికే శారదా కుంభకోణంలో ఆరోపణలు రావడంతో కొంత ఉక్కిరిబిక్కిరయ్యారు. దీంతో 2020 చివర్లో అనూహ్యంగా తృణమూల్‌ను వీడి భాజపాలో చేరారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తరఫున నందిగ్రామ్ నుంచి బరిలోకి దిగిన సువేందు.. మమతను ఓడించారు. అనంతరం రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో భవానీపూర్‌లో మమతను మరోసారి ఓడించి, ఇప్పుడు ఏకంగా బెంగాల్ సీఎంగా బాధ్యతలు చేపట్టడానికి సిద్ధమయ్యారు.

# వీడని సస్పెన్స్!

**(మొదటి పేజి తరువాయి)**

ఆహ్వానించాలంటూ ఇప్పటికే రెండు సార్లు గవర్నర్‌ను కలిసిన విజయ్‌కు.. లోక్‌భవన్ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించలేదు. ఇక శుక్రవారం సాయంత్రం టీవీకే అధినేత మూడోసారి గవర్నర్‌ను కలిశారు. తమకు 120 మంది సభ్యుల బలం ఉందని గవర్నర్‌కు విజయ్ వివరించినట్లు సమాచారం. దీంతో ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్.. విజయ్‌ని ఆహ్వానించారని వార్తలు వచ్చాయి. అలాగే సీఎంగా విజయ్ శనివారం ఉదయం 11 గంటలకు ప్రమాణస్వీకారం చేస్తారని కూడా విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అయితే కొత్త ప్రభుత్వ ఏర్పాటు విషయంలో గవర్నర్ కార్యాలయం నుంచి మాత్రం ఎలాంటి ప్రకటనా వెలువడకపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చినట్టయ్యింది. విజయ్ టీవీకేకు అప్పటి వరకు మద్దతు ప్రకటించిన వీసీకే, ఐయూఎంఎల్‌ల తీరుతో ఈ ప్రతిష్టంభన నెలకొంది. వీసీకే అధికారికంగా మద్దతు లేఖను అందించలేదు. మధ్యాహ్నం వరకు.. టీవీకేకు మద్దతు ఇస్తామని ప్రకటించిన ఐయూఎంఎల్ సాయంత్రం వరకు తన మద్దతను ఉపసంహరించుకుంది. ఈ మేరకు ఐయూఎంఎల్ ఒక ప్రకటనను సైతం విడుదల చేసింది. ఫలితగా టీవీకే బలం 116కు పడిపోయినట్టయ్యింది. అయితే ఈ కారణంగానే గవర్నర్ కార్యాలయం నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదని తెలుస్తోంది. దీంతో తమిళ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి.

**టీవీకేకు మద్దతు లేఖ మెయిల్ చేసిన వీసీకే**

అనిశ్చిత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో వీసీకే.. టీవీకేకు ఈమెయిల్ ద్వారా మద్దతు లేఖను పంపింది. ఈ విషయాన్ని వీసీకే ట్వీట్ ద్వరా తెలియజేసింది. కాగా వీసీకే, ఐయూఎంఎల్‌లకు ఇద్దరు చొప్పున ఎమ్మెల్యేలు ఉన్నారు.

**విజయ్ ప్రమాణస్వీకారంపై అనిశ్చితి**

శుక్రవారం సాయంత్రం మారిన పరిస్థితుల నడుమ సీఎంగా విజయ్ ప్రమాణస్వీకారంపై మేఘాలు కమ్ముకున్నాయి. శనివారం ఉదయం 11 గంటలకు విజయ్ ప్రమాణస్వీకారం చేస్తారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అయితే ఇప్పటికీ విజయ్ టీవీకే పార్టీ మెజారిటీ మార్కుకు రెండు స్థానాల దూరంలో ఉండటంతో ప్రభుత్వ ఏర్పాటుకు ఆటంకం ఏర్పడిందని రాజకీయ పరిశీలకులు వివరిస్తున్నారు.

**ఫలితాలు వెలువడినప్పటి నుంచి రాజకీయ అనిశ్చితి**

ఈనెల 4న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి తమిళనాడులో రాజకీయ అనిశ్చితి కొనసాగుతోంది. మొత్తం 234 స్థానాలు కలిగి ఉన్న తమిళనాడు అసెంబ్లీలో ప్రభుత్వ ఏర్పాటు కోసం మ్యాజిక్ ఫిగర్ 118 స్థానాలను దక్కించుకోవాలి. అయితే ఫలితాల్లో ఏ ఒక్క పార్టీ కూడా మ్యాజిక్ ఫిగర్‌ను అందుకోలేక పోయింది. విజయ్ టీవీకే 108 స్థానాలు గెలిచి అతిపెద్ద పార్టీగా అవతరించి.. మ్యాజిక్ ఫిగర్‌కు 10 స్థానాల దూరంలో ఆగిపోయింది. డీఎంకే 59, ఏఐఏడీఎంకే 47 స్థానాలకు పరిమితమయ్యాయి. ఇక కాంగ్రెస్ ఐదు స్థానాలు, పీఎంకే నాలుగు, సీపీఐ(ఎం), సీపీఐ, ఐయూఎంఎల్, వీసీకే లు రెండు స్థానాల చొప్పున, బీజేపీ, డీఎండీకే, అమ్మ మక్కల్ మున్నేట్ర కజగంలు ఒక్క సీటు చొప్పున గెలుచుకున్నాయి.

**గవర్నర్‌ను ఇప్పటికే రెండు సార్లు కలిసిన విజయ్**

ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో అతిపెద్ద పార్టీగా ఉన్న టీవీకే కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని అంతా భావించారు. కానీ ఇందుకు లోక్‌భవన్ బ్రేకులు వేసింది. ప్రభుత్వ ఏర్పాటుకు తమకు అవకాశమివ్వాలంటూ టీవీకే అధినేత విజయ్ ఇప్పటికే బుధ, గురు వారాల్లో రెండు సార్లు తమిళనాడు గవర్నర్ రాజేంద్ర అర్లేకర్‌ను కలిశారు. కానీ స్పష్టమైన మెజారిటీ 118 స్థానాలు లేవనే కారణంతో గవర్నర్ రెండు సార్లు కూడా విజయ్ ప్రతిపాదనను తిరస్కరించారు.

**డీఎంకే-అన్నాడీఎంకే కూటమి ప్రభుత్వంపై ఊహాగానాలు**

ఒకానొక సమయంలో తమిళనాడులో బద్ధ శత్రువులైన డీఎంకే, అన్నాడీఎంకేలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాలున్నాయని కూడా వార్తలు వచ్చాయి. బీజేపీని దూరం పెడితే తాము బయటి నుంచి అన్నాడీఎంకేకు మద్దతు తెలుపుతామని కొందరు డీఎంకే నేతలు కూడా ప్రతిపాదించినట్టు కథనాలు వెలువడ్డాయి. ఈ కూటమి ఏర్పాటుపై అంతర్గతంగా చర్చలు జరుగుతున్నట్టు కూడా వార్తలు గుప్పుమన్నాయి. అయితే ఈ వార్తలను డీఎంకే తోసిపుచ్చింది.

విజయ్‌కి మద్దతు తెలుపుతున్న పార్టీలు

విజయ్ టీవీకేకు కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ, వీసీకేకు మద్దతు తెలిపాయి. మొదటగా మద్దతు తెలిపిన పార్టీ కాంగ్రెస్. ఐదుగురు ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్ పార్టీ టీవీకేకు మద్దతు తెలపడంతో బలం 113కు చేరింది. తాజాగా మిగిలిన పార్టీలు కూడా సపోర్ట్ ఇవ్వడంతో అది మ్యాజిక్ ఫిగర్‌ను చేరినట్టయ్యింది. డీఎంకేతో పొత్తుతో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు టీవీకే పార్టీకి మద్దతు ఇస్తోంది. కాగా కొత్తగా ఏర్పడనున్న విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వంలో మద్దతు ఇస్తున్న పార్టీలకు కూడా క్యాబినెట్ బెర్త్‌లు దక్కనున్నట్టు తెలుస్తోంది. ఇందులో వామపక్షాలకు రెండు, వీసికేకు ఒక స్థానం దక్కనున్నట్టు వార్తలు వస్తున్నాయి.


**బయటనుంచే మద్దతు : వామపక్షాలు**

చెన్నైలో సంయుక్త పత్రికా సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి పి.షణ్ముగం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.వీరపాండ్యన్ మాట్లాడుతూడ టీవీకేకు మద్దతునివ్వాలని నిర్ణయించినట్టు ప్రకటించారు. టీవీకే మంత్రివర్గంలో తాము చేరబోవడం లేదని తెలిపారు. బయటనుంచే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. సంక్షోభ నివారణకు, గవర్నర్‌ను అడ్డుపెట్టుకొని బీజేపీ ఆడుతున్న నాటకానికి తెరదించడానికే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. మతోన్మాద శక్తులను వ్యతిరేకిస్తూ, తమిళనాడు హక్కులను పరిరక్షిస్తూ సాగించే పోరాటాల్లో డీఎంకేతో కలిసి తాము ముందుకు సాగుతామని అన్నారు.

**కృతజ్ఞతలు తెలిపిన విజయ్**

వామపక్షాలు మద్దతు ప్రకటించిన వెంటనే విజయ్ సీపీఐ(ఎం), సీపీఐ కార్యాలయాలకు వెళ్లి ఆయా పార్టీల నేతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. సవాళ్లతో కూడిన ఇటువంటి పరిస్థితుల్లో మద్దతు తెలియజేసినందుకు చాలా కృతజ్ఞుడిని అంటూ విజయ్ తెలిపారని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కె.బాలకృష్ణన్ చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మతోన్మాద శక్తులను అనుమతించేది లేదని ఆయన స్పష్టం చేశారన్నారు. తమిళనాడులో సుస్థిరమైన, లౌకిక, ప్రజాస్వామ్య ప్రభుత్వ ఏర్పాటు కోసమే టీవీకేకు మద్దతునిచ్చామని సీపీఐ తెలియజేసింది.

# ముస్తఫాపూర్ గ్రామపంచాయతీలో డీఎల్పీఓ విచారణ



**భీమదేవరపల్లి/మే8 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముస్తఫాపూర్ గ్రామపంచాయతీలో శుక్రవారం హనుమకొండ డీఎల్పీఓ గంగాభవాని విచారణ నిర్వహించారు. వార్డు సభ్యులు, గ్రామస్తులు ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదులపై గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సుదీర్ఘంగా విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భర్త గ్రామపంచాయతీ కార్యకలాపాల్లో పాల్గొనవద్దని డీఎల్పీఓ స్పష్టం చేశారు. సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు కలిసి గ్రామాభివృద్ధి కోసం సమన్వయంతో పని చేయాలని సూచించారు. అలాగే 2024 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బిల్లులను నిలిపివేయకుండా వెంటనే పరిష్కరించాలని గ్రామపంచాయతీ పాలకవర్గానికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నాగరాజు, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# మంత్రి పుట్టినరోజు సందర్భంగా హెల్మెట్ల పంపిణీ






**భీమదేవరపల్లి/మే8 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముస్తఫాపూర్ కొత్తకొండ రహదారిలో ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులకు శుక్రవారం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పుట్టినరోజు సందర్భంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, వాహనదారుల్లో భద్రతా చైతన్యం పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ముఖ్యంగా రహదారులపై ప్రయాణించే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ఇది ప్రాణాలను కాపాడే రక్షణ కవచమని అవగాహన కల్పించారు. సుమారు వంద మంది వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్‌ల ఫోరమ్ మండల అధ్యక్షులు తాళ్ల అరవింద్ గౌడ్, కాంగ్రెస్ కొత్తకొండ గ్రామశాఖ అధ్యక్షులు వెంకటేష్, నాయకులు చింత రాజు, రొంటాల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. మంత్రి జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో సామాజిక బాధ్యతను పెంచుతాయని వారు అభిప్రాయపడ్డారు.

# ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ..

## -వ్యక్తికి తీవ్ర గాయాలు.





**బయ్యారం/,మే 8.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండలం సత్యనారాయణపురం అలిగేరు బ్రిడ్జి వద్ద రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి.మహబూబాబాద్ నుండి ఇల్లందు వైపు బైక్ పై వెళుతున్న కారేపల్లి గ్రామానికి చెందిన చాట్ల సంపత్ (36)ను బయ్యారం వైపు నుండి వస్తున్న ఐస్ క్రీమ్ బండి బలంగా ఢీ కొట్టింది.రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఈ సంఘటనలో సంపత్ కు కుడికాలు తొడ వద్ద ఫ్రాక్చర్ అయిందని స్థానికులు తెలిపారు.తీవ్ర రక్తస్రావాన్ని గమనించిన స్థానికులు 108 కు కాల్ చేయగా బయ్యారం 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటి శ్రీను,పైలెట్ అశోక్ వెంటనే ప్రమాదం జరిగిన ప్రదేశానికి చేరుకొని గాయపడిన వ్యక్తికి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం చికిత్స కోసం మహబూబాబాద్ ఏరియా హాస్పిటల్ కు తరలించిన్నట్లు వారు తెలిపారు.

## కేరళం అడిషనల్ డీజీపీగా నియమించబడ్డ

# లక్ష్మణ్ నాయక్ కు సన్మానం.



**బయ్యారం/,మే 8.(జర్నలిస్ట్ వార్త)**



మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలానికి చెందిన ఐపీఎస్ అధికారి గుగులోతు లక్ష్మణ్ నాయక్ అరుదైన గౌరవం పొందారు.1997 ఐపిఎస్ బ్యాచ్ చెందిన గుగులోత్ లక్ష్మణ్ నాయక్ ప్రస్తుతం కేరళం రాష్ట్ర అడిషనల్ డీజీపీగా పదోన్నతి పొందిన సందర్భంగా బయ్యారం మండలానికి చెందిన పిఆర్టీయు మండల నాయకులు గుగులోత్ రామారావు,సర్పంచ్ పండు నాయక్, భూక్యా రమేష్ రాథోడ్,రవికుమార్, తరుణ్ లు అడిషనల్ డీజీపీ లక్ష్మణ్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు.తన విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ అత్యున్నత స్థాయికి చేరుకోవాలని వారు ఆకాంక్షించారు. తమ ప్రాంతానికి చెందిన వ్యక్తి పొరుగు రాష్ట్రంలో ఉన్నత పదవి చెపట్టడంపై హర్షం వ్యక్తం చేశారు.

## బయ్యారంలో పారిశుధ్య పనులను పరిశీలించిన సర్పంచ్.



**బయ్యారం/,మే 8.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డు నుండి పెట్రోల్ బంకు వరకు రోడ్డు పక్కన వున్న చెత్త చెదారం,చెట్లను జేసీబీతో తొలగిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలను సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ శుక్రవారం పరిశీలించారు.బయ్యారం
మేజర్ గ్రామపంచాయతీలో ఈ వేసవిలో త్రాగు నీటి సమస్యలు రాకుండా అధికారుల దృష్టికి తీసుకెళ్తూ,నీటి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటు,రాబోవు వర్షాకాలంలో దృష్టిలో ఉంచుకొని పారిశుధ్యంపై దృష్టి పెడుతున్నామన్నారు.పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి సర్పంచ్ సూచించారు.ఈ కార్యక్రమం పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పశుసంపదను పెంపొందించుకోవాలి

## -వర్ధన్నపేట మార్కెట్ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి.



**రాయపర్తి/మే 8(జర్నలిస్ట్ వార్త):**మనవాలి మనుగడకు పశువులే మూలదారం అని ప్రతి ఒక్కరు పశు సంపదను పెంపొందించుకోవాలి వర్ధన్నపేట మార్కెట్ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మహబూబ్ నగర్ గ్రామంలో ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక లో భాగంగా పశుసంవర్ధక ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ, దూడల ప్రదర్శన పై రైతులకు అవగాహనా సదస్సును నిర్వహించారు.ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ పశువుల పెంపకం వల్ల రైతులకు అదనపు ఆదాయం చేకూరుతుందని అన్నారు.రైతులు పశువులలో వచ్చే సీజనల్ వ్యాధులను అరికట్టెందుకు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.ఉచిత గర్భకోశ వ్యాధులు నివారణ టీకాలు వేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెండ్లి మహేందర్ రెడ్డి, పశు వైద్యాధికారులు డాక్టర్ శృతి,డాక్టర్ సుధారాణి, సిబ్బంది వెంకటయ్య, గణేష్, గోపాల మిత్రులు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## రామచంద్రపురంలో మినీ బ్యాంక్ సెంటర్లలలో

# ఘరణా మోసం..?

### -బయోమెట్రిక్ వేలిముద్రలతో మినీ ముసుగులో మనీ దర్జాగా దోపిడీ...!

### -10 సంవత్సరాల్లో కోట్లల్లో దందా చేసినట్టు ఆరోపణలు..?

**బయ్యారం/,మే 8.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలంలో ఏజెన్సీ గ్రామాలలో మినీ బ్యాంక్ యాక్సిస్ యాపులతో వినియోగదారుల బ్యాంకు ఖాతాలలో సొమ్మును మినీ బ్యాంకుల పేరుతో కోట్ల రూపాయలను గుట్టు చప్పుడు కాకుండా కొల్లగొడుతున్నట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే బయ్యారం మండలంలోని రామచంద్రపురం గ్రామంలో యాప్ లతో బ్యాంకు వినియోగదారుల ఆధార్ కార్డులతో అనుసంధానమైన బ్యాంకు ఖాతాలోని సొమ్మును వారి అవసరాల నిమిత్తం డబ్బులు డ్రా చేసేందుకు మినీ బ్యాంకులకు వస్తున్న సెంటర్లలో ఖాతాదారులకు అసలైన బ్యాంకు బ్యాలెన్స్ వివరాలు తెలియ పరచకుండా వారి ఒక్కొక్కరి ఖాతాల్లో సొమ్మును లక్షల రూపాయలు కాజేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.ఈ వ్యవహారం సుమారుగా 10 సంవత్సరాల నుండి మినీ బ్యాంకు సెంటర్ ల ద్వారా ఆర్థిక లావాదేవీలు జరుపుతున్న విషయం విధితమే..! మినీ బ్యాంకులవారు ఆయా గ్రామాలలో బ్యాంకు ఖాతా, ఆధార్ నెంబర్,ఫోన్ నెంబర్ తో లింక్ అయి ఉన్న ఖాతాల వారు తమ అవసరాలను తీర్చుకోవడానికి మినీ సెంటర్లకు వెళ్లి వారి ఖాతాలోని డబ్బుల వివరాలను తెలుసుకొని వారికి కావలసిన డబ్బులను అడిగి తీసుకోవడం పరిపాటి,ఇదే అదునుగా భావించిన మినీ బ్యాంక్ సెంటర్ల వారు నిరక్షరాస్యులు, వృద్ధులు, వికలాంగులు ,మహిళలు ,రైతులు, విద్యార్థుల, బ్యాంకు ఖాతాల నెంబర్ లేకుండానే, ఆధార్ నెంబర్తో పేనియర్ యాప్ ద్వారా రామచంద్రపురం గ్రామంలో ఓ మినీ బ్యాంక్ సెంటర్ నిర్వాహకుడు పెద్ద ఎత్తున బ్యాంకు లావాదేవీలలో ఎటువంటి రశీదులు వినియోగదారులకు ఇవ్వకుండా భారీ ఎత్తున లక్షల రూపాయల మోసాలకు పాల్పడినట్లు గ్రామస్తుల నుండి సమాచారం.రామచంద్రాపురం,రెడ్యా తండా,కస్తూరి నగరం,మెట్ల తిమ్మాపురం,చింతోని గుంపు, కంబాలపల్లి,భీమ్లా తండా,అల్లిగూడెం, చర్లపల్లి,భద్రుతండ,పెంకుతండ, సింగారం తండా,జగత్రావుపేట తదితర గ్రామాలలోని బ్యాంకు ఖాతాలలో పే నియర్ యాప్ ద్వారా రామచంద్రాపురంలో హర్షిత మినీ బ్యాంకు సెంటర్ నుండి భూక్య పూలి, ధరావత్ మల్సూర్,జరుపుల భీమా, ధరంతో హరిలాల్ ,అంగోత్ కాంతి, అంగోత్ సూర్య, బానోత్ వీరన్న,ఖాతాలలో బయోమెట్రిక్ తప్పుడు సమాచారంతో వేల రూపాయలు వారి ఖాతాల్లో సొమ్మును పలు దఫాలుగా పెద్ద ఎత్తున కోట్ల రూపాయల ఆర్థిక






లావాదేవీలు జరగడంతో బ్యాంకు ఖాతాలవారిని పెద్ద ఎత్తున మోసగించిట్లు తెలిసింది. మినీ బ్యాంకు వెయ్యి రూపాయలకు 20 రూపాయల కమిషన్ తీసుకుంటూ, యాప్ ల నుంచి వచ్చిన కమిషన్లను ఖాతాలోని సొమ్మును అసలు ఉన్నదాని కంటే తక్కువ బ్యాలెన్స్ చెప్పి,బయోమెట్రిక్ పై వేలిముద్రలతో పలుమార్లు వేయించుకొని డబ్బులను దొంగ చాటుగా డ్రా చేసుకున్నట్లు, నిర్వాహకుడి ఖాతాలోకి మళ్లించినట్లు, డివిజన్ డెబిట్ అయినట్లు రిజిస్టర్లు నమోదు చేసుకోవడం జరిగినట్లు గ్రామస్తులు ఆరోపించారు.టిజీవీబీ బ్యాంకు ఖాతాదారురాలు గుగులోత్ రాజలి ఈనెల 5 న రామచంద్రపురం లోని మినీ బ్యాంకు సెంటర్ కు నా ఖాతాలోని సొమ్మును పరిశీలించగా, మినీ బ్యాంకు నిర్వాకుడు నా ఖాతాలోని సొమ్ము 7 వేల రూపాయలు ఉన్నాయని నమ్మబలికి ఉన్నదానికంటే తక్కువ చూపి 6 వేల రూపాయలు బయోమెట్రిక్ తో నా వేలిముద్ర ద్వారా డబ్బులు ఇచ్చాడు. వంద రోజుల పనికి వెళ్లగా నా ఖాతాలో 11వేల రూపాయలు పడినట్లు తెలియడంతో 7వేలు వచ్చినట్టు చెప్పి 6 వేలు నా చేతికిచ్చి, 4వేలు మీని సెంటర్ నిర్వాకుడు కాజేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అనుమానం వచ్చిన బాధితురాలు ఈ నెల ఆరున బ్యాంకుకు వెళ్లగా బయ్యారం మరో మినీ బ్యాంకు సెంటర్లో తమ బ్యాంకు బ్యాలెన్స్ వివరాలను పరిశీలించుకోగా ఈనెల 5న పదివేల రూపాయలు డ్రా చేసినట్లు ఉన్నదని నిర్వాహకురాలు స్టేట్ మెంట్ కాగితం యాప్ నిర్వాహకుడి చూపడంతో,అసలు విషయం బయటకు వస్తుందేమోనని,4 వేల రూపాయలు డబ్బులు బాధితురాలు ఇంటికి వెళ్లి ఇవ్వడంతో పలు అనుమానాలకు తావిస్తుందని బాధితురాలు తెలిపారు.మినీ బ్యాంకులో మనీ దోపిడి పై ఏజెన్సీ గ్రామాలలో ఖాతాదారుల ఆందోళన. మినీ బ్యాంకులలో ఖాతాదారుల నిరక్షరాస్యతను ఆసరా చేసుకొని వారి నుంచి మండలంలో కోట్ల రూపాయల దండుకున్నట్లు ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి.మిని బ్యాంకుల మని గత పది సంవత్సరాల నుండి యదేచ్ఛగా అక్రమార్కులకు మిని బ్యాంక్ సెంటర్ లు అడ్డాలుగా కొనసాగుతుండటంతో బ్యాంకు ఖాతా దారులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు.మండలంలో పలువురు చర్చించుకుంటున్నారు.ఏజెన్సీ గ్రామాలలో ఇప్పటికైనా అధికారులు స్పందించి మినీ బ్యాంకు ద్వారా సేవలను మరింత సురక్షితం చేసి ఖాతాదారులకు బ్యాంకుల పట్ల నమ్మకం కలిగించే విధంగా చర్యలు ఉండాలని పలువురు వేడుకుంటున్నారు.దీనిపై మండలంలోని సంబంధిత ఎస్బిఐ యూనియన్ బ్యాంక్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్లను వివరణ కోరగా మినీ యాపు వారు అన్ని బ్యాంకుల నుండి యాక్సెస్ తీసుకొని ప్రైవేట్ కంపెనీకి అప్పజెప్పడం జరుగుతుందని వారి జరిపిన ఆర్థిక లావాదేవీలు మా వద్ద ఉండవని వారికి ఐడి ద్వారానే వారికి క్రెడిట్ డెబిట్ చూపెడుతుందని తెలిపారు.ఆర్థిక లావాదేవీల విషయంలో మా దగ్గర పూర్తి సమాచారం తెలియదని తెలిపారు.

# పెద్దపెండ్యాలకు రూ.3.62 కోట్ల అభివృద్ధి వరాలు

## సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు, ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం








**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో మే 8 (జర్నలిస్ట్ వార్త):** కడియం శ్రీహరి ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఘనంగా ప్రారంభించారు. మాజీ ఉపముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన గ్రామ అభివృద్ధికి పెద్దపీట వేస్తూ రూ.3.62 కోట్ల విలువైన పనులను ప్రజలకు అంకితం చేశారు.ఈ సందర్భంగా గ్రామంలో రూ.3 కోట్ల నిధులతో నిర్మించిన ప్రధాన సీసీ రోడ్డు, రూ.48 లక్షల వ్యయంతో చేపట్టిన ఇతర సీసీ రోడ్లు, ఎస్సీరజక కమ్యూనిటీ హాళ్లు, ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ ప్రహరీ గోడలను ప్రారంభించారు. అదేవిధంగా పేదల కోసం మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను కూడా ప్రారంభించి లబ్ధిదారులతో మాట్లాడారు.
అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామ ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి గ్రామాభివృద్ధే తన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.పెద్దపెండ్యాల గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని పేర్కొన్నారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ భవనాలు, పేదల గృహ నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం సహకారంతో మరిన్ని నిధులు తీసుకువచ్చి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తోట నాగరాజు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మక్కలు కొనడంలో ప్రభుత్వం విఫలం

**-మాజీ మంత్రి ఎర్రబెల్లి.**

**-రైతులతో కలసి జాతీయ రహదారిపై ధర్నా చేపట్టిన ఎర్రబెల్లి.**



**రాయపర్తి/మే 8(జర్నలిస్ట్ వార్త):** ఆరుగాలం రైతులు కష్టపడి పండించిన మక్కలు కొనడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిందని రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మక్కల రైతులకు మద్దతుగా మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఎదురుగా వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై రైతులతో కలసి ధర్నా చెప్పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అరిగోస పేడుతుందని అన్నారు. రైతులు పండించిన పంటను కొనలేని దౌర్భాగ్య స్థితిలో ప్రభుత్వం ఉందని అన్నారు.మార్కుఫెడ్ అధికారులతో ఫోన్ లో మాట్లాడి వారం రోజుల్లో మక్కలు అన్ని కొనకపోతే భారీ ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరిపాటి శ్రీనివాస్ రెడ్డి, రంగు కుమార్ గౌడ్, పూస మధు, లేతకుల రంగారెడ్డి, గారే నరసయ్య, గజవెల్లి ప్రసాద్, అయిత రామచందర్, కర్ర రవీందర్ రెడ్డి, పుల్ల ఎల్లా గౌడ్, పోగులకొండ వేణు, చందు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పరుపాటి పరామర్శ



**రాయపర్తి/మే 8(జర్నలిస్ట్ వార్త):**
మండల కేంద్రానికి చెందిన చందు పర్వతాలు భార్య చందు రమ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న పర్వతాలు బాల్య మిత్రుడు ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపటి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒక క్వింటా బియ్యం, ఆయిల్ క్యాన్ అందజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్,లేతకుల రంగా రెడ్డి, తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, బందెల బాలరాజు, మాజీ సర్పంచ్ గారే నర్సయ్య,మాజీ ఎంపీటీసీ ఐత రామ్ చందర్,చందు రామ్, ఎండీ అక్బర్, ఎండీ యూసఫ్, పోగులకొండ వేణు, కుంట రాంబాబు, పాము మనోహర్, శివ కుమార్, గారే విష్ణు, ఎండీ యకూబ్, పీరని రాజు,తదితరులు పాల్గొన్నారు.

# కంబాలపల్లి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన సర్పంచ్ లింగనాయక్.

**బయ్యారం/,మే 8.(జర్నలిస్ట్ వార్త)**



బయ్యారం మండలంలోని కంబాలపల్లి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కోయగూడెం సర్పంచ్ లింగానాయక్ సందర్శించారు.మొక్కజొన్న తరలింపు ప్రక్రియ,లారీల ఏర్పాటు వంటి అంశాలపై కొనుగోలు కేంద్ర నిర్వకులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ లింగానాయక్ మాట్లాడుతూ ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య,బయ్యారం సోసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి చొరవతో ఏజెన్సీ ప్రాంత రైతులు పండించిన మొక్కజొన్నలను బయ్యారం ఏఎంసి గోడౌన్‌లకు తరలించేలా చర్యలు వేగవంతం చేస్తున్నారని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,ప్రతి గింజ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులందరికీ గిట్టుబాటు ధర వచ్చేలా కృషి జరుగుతుందని అన్నారు.రైతుల సమస్యలను గుర్తించి మొక్కజొన్న కొనుగోలు,నిల్వ,రవాణా గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న ఎమ్మెల్యేకి సోసైటీ చైర్మన్ కి రైతులందరూ రుణపడి ఉంటారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోంది రాంబాబు,వార్డ్ మెంబర్ గుగులోత్ వీరు,రైతులు సోమన్న,సూర్నపాక బాషా,పగిడిపల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తిగత దూషణలు మానుకోవాలి

**ప్రజా సమస్యలపై రాజకీయ పార్టీలు పోరాడాలి**

**మిషన్ భగీరథ నీరు నిరంతరం అందించాలి : చాడా వెంకటరెడ్డి**






**ఎల్కతుర్తి, మే 8 (జర్నలిస్ట్ వార్త):** రాజకీయ పార్టీలు వ్యక్తిగత దూషణలు మానుకుని ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సీపీఐ మాజీ ఎమ్మెల్యే, మాజీ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకటరెడ్డి సూచించారు. ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.అసంపూర్తిగా ఉన్న దేవాదుల ప్రాజెక్టును ప్రభుత్వం త్వరగా పూర్తి చేసి చివరి ఆయకట్టు రైతుకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మిట్ట ప్రాంత రైతాంగానికి దేవాదుల ప్రాజెక్టు ఎంతో ఉపయోగపడుతోందన్నారు.ఇందిరమ్మ గృహాల రెండో విడత దరఖాస్తులను పరిశీలించి అర్హులైన పేదలకు వెంటనే ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ నీటిని నిరంతరం సరఫరా చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని ప్రభుత్వాన్ని కోరారు.ఇటీవల రాజకీయ నాయకులు వ్యక్తిగత విమర్శలకు దిగడం ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. ప్రజా సమస్యలపై చర్చించి వాటి పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు.అనంతరం ఇటీవల ఎన్నికైన గోపాల్‌పూర్ సర్పంచ్ కర్రె లక్ష్మిని చాడా వెంకటరెడ్డి శాలువాతో సన్మానించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉట్కూరి రాములు జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, మద్దెల ఎల్లేష్, ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, ఏదునూరి వెంకటరాజు, కొట్టపాక రవి, మాలోత్ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌ది విష రాజకీయాలు: కడియం

**రైతులను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం -కేటీఆర్ వ్యాఖ్యలు సంస్కారహీనతకు నిదర్శనం**

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, మే 8 (జర్నలిస్ట్ వార్త):** కడియం శ్రీహరి కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ విషం కక్కుతోందని, రైతులను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తోందని మండిపడ్డారు. అధికారంలో ఉన్న ముఖ్యమంత్రిపై కేటీఆర్ సభ్యత, సంస్కారం మరిచి మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు.ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల గ్రామంలో రూ.3.62 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో రూ.3 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్డు, రూ.48 లక్షలతో నిర్మించిన ఇతర సీసీ రోడ్లు, ఎస్సీరజక కమ్యూనిటీ హాళ్లు, ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ ప్రహరీ గోడలతో పాటు ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు.ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను తప్పుదోవ పట్టిస్తూ బీఆర్ఎస్ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందన్నారు. గన్ని బ్యాగుల కొరత, గోదాముల సమస్యల వల్ల కొంత జాప్యం జరుగుతోందని, రైతులు సహకరించాలని కోరారు. అధికారంలో ఉన్నప్పుడు వేల కోట్లు, వందల ఎకరాలు కూడబెట్టుకున్న వారే ఇప్పుడు ప్రభుత్వంపై గగ్గోలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.కేటీఆర్ వ్యాఖ్యలు చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్‌కు ఎంత అక్కసు ఉందో అర్థమవుతోందన్నారు.



తెలంగాణకు ఒక్క రూపాయి, ఒక్క ప్రాజెక్టు కూడా ఇవ్వని కేంద్ర బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.కడియం శ్రీహరి ఏమి చేశాడని అడిగేవారు పెద్దపెండ్యాలకు వచ్చి చూడాలి" అని వ్యాఖ్యానించిన ఆయన, తాను 32 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎప్పుడూ అవినీతికి పాల్పడలేదని స్పష్టం చేశారు. పని చేయిస్తానని ఒక్క రూపాయి తీసుకున్నట్లు ఎవరైనా నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. నిజాయితీ, నిక్కచ్చితనంతోనేరాజకీయాల్లోకొనసాగుతున్నానన్నారు.పెద్దపెండ్యాల గ్రామానికి ఉమ్మడి రాష్ట్ర కాలంలోనే ఆరు వైపులా బీటీ రోడ్లు వేయించానని తెలిపారు. ప్రస్తుతం ధర్మసాగర్, తాటికాయల, కరుణపురం, క్యాతంపల్లి,



చిన్నపెండ్యాల రోడ్ల అభివృద్ధికి రూ.37.60 కోట్లు మంజూరు చేయించినట్లు వెల్లడించారు. గ్రామంలో సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు, డ్రైనేజీల నిర్మాణానికి మరో రూ.4 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.ఇప్పటికే 54 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని, రెండో విడతలో మరో 50 ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. త్వరలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా మంజూరు చేస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నందునే భారీగా అభివృద్ధి నిధులు తీసుకురాగలుగుతున్నానని పేర్కొన్నారు.
కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తోట నాగరాజు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవుల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి

**వరంగల్ క్రిస్టియన్ సొసైటీ సదస్సులో బిర్రు మహేందర్ మాదిగ పిలుపు**



**వరంగల్/మే 8 (జర్నలిస్ట్ వార్త):** దళిత క్రైస్తవుల సామాజిక, రాజకీయ హక్కుల సాధన కోసం అందరూ ఐక్యంగా ఉద్యమించాలని దళిత రత్న అవార్డు గ్రహీత, ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు బిర్రు మహేందర్ మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం వరంగల్ క్రిస్టియన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన దళిత క్రైస్తవుల అవగాహన సదస్సుకు ఆయన హాజరయ్యారు.
ఈ సందర్భంగా మహేందర్ మాదిగ మాట్లాడుతూ దశాబ్దాలుగా దళిత క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాలు చిత్తశుద్ధితో స్పందించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధంగా తమకు దక్కాల్సిన ఫలాలను, హక్కులను సాధించుకోవడంలో వెనకడుగు వేయకూడదని సూచించారు. సమాజంలో అట్టడుగున ఉన్న వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, వారి విద్యాభివృద్ధికి క్రైస్తవ మిషనరీలు చేస్తున్న కృషి వెలకట్టలేనిదని ఆయన ఈ సందర్భంగా కొనియాడారు.సదస్సులో ప్రధానంగా దళిత క్రైస్తవుల ప్రస్తుత స్థితిగతులు, విద్య, ఉద్యోగ అవకాశాల మెరుగుదలపై సుదీర్ఘంగా చర్చించారు. హక్కుల సాధనలో భాగంగా భవిష్యత్తులో చేపట్టబోయే కార్యాచరణను రూపొందించుకోవాలని నాయకులు తీర్మానించారు. అనంతరం వివిధ రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న ప్రతినిధులను సొసైటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ మాదిగ మాట్లాడుతూ హక్కుల సాధనలో ఐక్యత అవసరమని గుర్తుచేశారు.
ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బిర్రు కరుణాకర్, నల్లబెల్లి గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, గోలి సుధాకర్, ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకులు, జిల్లా పాస్టర్ యూనియన్ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో క్రైస్తవ సోదరులు పాల్గొని సదస్సును విజయవంతం చేశారు.





# ఊపిరి భారమై.. ప్రాణం పోరాడుతోంది.

**అరుదైన వ్యాధితో వర్ధన్నపేట యువకుడి యుద్ధం**

**రూ. 80 లక్షలు ఉంటేనే కార్తీక్ బతికేది.. -దాతల సాయం కోసం ఎదురుచూపు**

**వర్ధన్నపేట/మే 8 (జర్నలిస్ట్ వార్త):**
ఆ వయసు ఉరకలెత్తే ఉత్సాహంతో ఉండాలి. రేపటి భవిష్యత్తుపై వెయ్యి ఆశలతో కదలాలి. కానీ, విధి ఆ యువకుడిపై పగబట్టింది. పట్టుమని పద్దెనిమిదేళ్లు కూడా నిండకముందే ప్రాణాంతక వ్యాధి అతణ్ణి చుట్టుముట్టింది. శ్వాస పీల్చుకోవడమే ఒక పోరాటంగా మారి, మంచానికే పరిమితమైన వర్ధన్నపేట యువకుడు బుడిగ కార్తీక్ కథ ఇది. వరంగల్ జిల్లా వర్ధన్నపేటకు చెందిన సుధాకర్, సునీత దంపతుల కుమారుడు కార్తీక్ ప్రస్తుతం పల్మనరీ ఆర్టీరియల్ హైపర్ టెన్షన్ (ఫాూఎ) అనే తీవ్రమైన ఊపిరితిత్తుల వ్యాధితో ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు.

**కదలలేని స్థితిలో..**

**ఆక్సిజన్ సాయంతో.**

ప్రస్తుతం కార్తీక్ పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. సాధారణంగా ఊపిరి పీల్చుకునే శక్తి కూడా లేకపోవడంతో నిరంతరం ఆక్సిజన్, బైపాప్ యంత్రాల సాయంతోనే ప్రాణాలను నిలుపుకుంటున్నాడు. వరంగల్ లోని ఫాదర్ కొలంబో వైద్య



విజ్ఞాన సంస్థ (మెడికేర్ ఆసుపత్రి) లో చికిత్స పొందుతున్న అతణ్ణి పరీక్షించిన వైద్యులు.విన్‌రెవైర్ (సోటాటర్ సెప్ట్ - 45 మి.గ్రా) అనే ఇంజెక్షన్లు ఇస్తేనే ప్రాణాలు నిలబడతాయని స్పష్టం చేశారు.

**గుండె పగిలే ఖర్చు..**

ఈ వైద్యం కార్తీక్ కుటుంబానికి పెను భారంగా మారింది. ఒక్కో ఇంజెక్షన్ ధర సుమారు 4.50 లక్షల నుంచి 5 లక్షల రూపాయల వరకు ఉంటుంది.



ప్రతి 21 రోజులకు ఒక డోస్ చొప్పున, మొత్తం 17 డోసులు ఇవ్వాల్సి ఉంటుందని వైద్యులు వెల్లడించారు. అంటే, మొత్తం చికిత్సకు సుమారు 75 లక్షల నుండి 85 లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతుంది. సామాన్య మధ్యతరగతి కుటుంబానికి ఇది అందని ద్రాక్షలా మారింది. అంత పెద్ద మొత్తాన్ని సమీకరించలేక ఆ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు.

**దాతలారా కదలండి..**

మా బిడ్డ కళ్లముందే మౌనంగా రోదిస్తున్నాడు. వాడిని కాపాడుకోవడానికి మా దగ్గర ఏమీ మిగిలిలేదు అంటూ తల్లి సునీత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్తీక్ ప్రాణాలను కాపాడేందుకు ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, స్వచ్ఛంద సంస్థలు మరియు దాతలు ముందుకు రావాలని ఆ కుటుంబం వేడుకుంటోంది. మీరు చేసే చిన్న సహాయం కూడా ఆ యువకుడికి పునర్జన్మను ప్రసాదిస్తుంది.

**సహాయం చేయాలనుకునే వారు.**

బాధితుడి తండ్రి సుధాకర్ ను సెల్ నంబర్ 99635 56654 ద్వారా సంప్రదించవచ్చు. వైద్య పత్రాలు, ఇతర వివరాలు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయి. ఒక నిండు ప్రాణాన్ని కాపాడేందుకు మనందరం చేయిచేయి కలుపుదాం.

# ఖమ్మంలో శాంతియుతంగా పాస్టర్ల ర్యాలీ

**దళిత క్రిస్టియన్ల హక్కుల కోసం ఐక్య పోరాటం చేయాలి**




**ఖమ్మం/, మే 8 (జర్నలిస్ట్ వార్త):** దళిత క్రిస్టియన్ల హక్కుల సాధన కోసం ఖమ్మంలో నిర్వహించిన శాంతి ర్యాలీ శాంతియుతంగా సాగింది. తెలంగాణ దళిత క్రైస్తవ హక్కుల సాధన కమిటీ, ఖమ్మం జిల్లా ఆల్ పాస్టర్స్ ఫెలోషిప్స్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం పెవిలియన్ గ్రౌండ్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏసీఐసీపీస్ కమిటీ చైర్మన్ పల్లా రాజశేఖర్ అధ్యక్షత వహించగా, సీఎస్ఐ బిషప్ పద్మారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దళిత క్రిస్టియన్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయం చేయాలని బిషప్ పద్మారావు కోరారు. హక్కుల సాధన కోసం అందరూ ఏకమై పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ర్యాలీలో మాల మహానాడు నాయకుడు వీరభద్రం, ఎమ్మార్పీఎస్ నాయకుడు నందిపాటి మనోహర్, క్రైస్తవ నాయకులు చల్లగుండ్ల రమేష్‌బాబు, వేముల సత్యం, జెకర్యా హనుమంతరావు, సైమన్, నేలాల బాలస్వామి, మధు, లాజర్ నాయక్, బోడా దానియేలు, టైటస్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ నియోజకవర్గాలు, మండలాలు, పట్టణాలకు చెందిన క్రైస్తవ సంఘాల నాయకులు, పాస్టర్లు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# బెల్ట్‌షాపులపై గ్రామాల్లో యుద్ధం


**మద్యం వైపు యువత.. ఆందోళనలో తల్లిదండ్రులు -ఎక్సైజ్ వ్యవస్థపై విమర్శలు**


**ఎల్కతుర్తి, మే 8 (జర్నలిస్ట్ వార్త):** ఎల్కతుర్తి మండలంలో బెల్ట్‌షాపులు విస్తరిస్తుండటంతో గ్రామాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మండల కేంద్రంలోని రెండు మద్యం దుకాణాల్లో ఎంఆర్పీ ధరల కంటే రూ.20 నుంచి రూ.30 వరకు అధికంగా మద్యం విక్రయిస్తున్నట్లు మద్యం ప్రియులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉండాల్సిన వాష్‌రూములు, మూత్రశాలలు లేకపోవడంపై వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మద్యం దుకాణాలపై ఎక్సైజ్ శాఖ పర్యవేక్షణ పూర్తిగా విఫలమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని 20 గ్రామాల్లో దాదాపు 250 వరకు బెల్ట్‌షాపులు నడుస్తున్నట్లు అంచనాలు ఉన్నాయి. ఒక్కో గ్రామంలో 10 నుంచి





20 వరకు అక్రమ మద్యం విక్రయ కేంద్రాలు కొనసాగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. కొత్తరకాల మద్యం సీసాలు దుకాణాల్లో కనిపిస్తున్నాయని, పర్మిట్‌రూముల్లో తాత్కాలిక తడకలు ఏర్పాటు చేసి పరిశుభ్రత లేకుండా విక్రయాలు కొనసాగిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఆహార పదార్థాల వద్ద దుర్వాసన వెదజల్లుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. గ్రామాల్లో బెల్ట్‌షాపుల కారణంగా యువత చదువులను పక్కనబెట్టి మద్యానికి అలవాటు పడుతోందని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో ఎప్పుడైనా మద్యం సులభంగా లభిస్తుండటంతో యువత చెడు వ్యసనాలకు గురవుతోందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని గ్రామాల్లో సర్పంచులు, యువత కలిసి బెల్ట్‌షాపుల నిర్మూలనకు కదిలివస్తున్నారు. గ్రామాల్లో మద్యపాన నిషేధంపై అవగాహన కల్పిస్తూ బెల్ట్‌షాపులను మూసివేయాలని తీర్మానాలు చేస్తున్నారు. "భవిష్యత్ తరాల కోసం చెట్లను నాటుదాం.. మద్యం షాపులను మూసేద్దాం" అనే నినాదంతో గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు.

# నూతన వార్డు సభ్యులను సన్మానించిన కాంగ్రెస్ నాయకురాలు సువార్త









**పర్వతగిరి/మే8(జర్నలిస్ట్ వార్త):** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం ఏనిగల్ గ్రామంలో జిల్లా కాంగ్రెస్ నాయకురాలు మాసాని సువార్త సమక్షంలో నూతన పాలకవర్గ సభ్యులకు ఘన సన్మానం జరిగింది. వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామానికి చెందిన నూతన వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ వార్డ్ మెంబర్ మరుపట్ల ప్రశాంత్ గోలి సుధాకర్ బరిగల రేణుక, బిర్రు రేణుకలను ఆమె శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాసాని సువార్త మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన వారు ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామాభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని, నూతన పాలకవర్గం వార్డుల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని ఆమె సూచించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో వార్డు సభ్యుల పాత్ర కీలకమని, పారదర్శకమైన పాలనతో ప్రజలకు చేరువ కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు. సన్మానం పొందిన వార్డు సభ్యులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాభివృద్ధిలో పాలుపంచుకుంటామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.


# ఎల్కతుర్తిలో పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు




**ఎల్కతుర్తి/, మే 8 (జర్నలిస్ట్ వార్త):** రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ 59వ జన్మదిన వేడుకలను ఎల్కతుర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇంద్రసేన రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పుల్లూరి శ్రీధర్‌రావుతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గోలి రాజేశ్వర్‌రావు, అశోక్‌రెడ్డి, మోత్కుపల్లి శ్రీకాంత్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, ఘనబోయిన సృజనరాజు, రమణారెడ్డి, గూటం జోగిరెడ్డి, అనిల్‌కుమార్, ముప్పు మహేందర్, యాదగిరిగౌడ్, రంజిత్‌రెడ్డి, శ్రీనివాస్, రమేష్‌బాబు, రాజేందర్, కరట్లపల్లి రమేష్, సుధీర్‌కుమార్, నరేష్, మదే రాములు, గోడి శాల నరేష్, రాజన్నగౌడ్, రాజయ్య, వెంకన్న, రాహుల్, ఎల్తూరి రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

# బిర్రు మహేందర్ మాదిగకు ఘనసన్మానం

**దళిత రత్న అవార్డు రావడం గర్వకారణం : మాసాని సువార్త**





**పర్వతగిరి/మే8(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక దళిత రత్న అవార్డుకు ఎంపిక చేసిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు బిర్రు మహేందర్ మాదిగకు పర్వతగిరి మండలంలోని ఏనిగల్లు గ్రామంలో ఘనంగా సన్మానం జరిగింది. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకురాలు మాసాని సువార్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని మహేందర్ మాదిగను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా మాసాని సువార్త మాట్లాడుతూ సామాన్య గ్రామీణ కుటుంబంలో జన్మించిన మహేందర్ మాదిగ, దశాబ్ద కాలంగా అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నారని కొనియాడారు. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ సారథ్యంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమాల్లో ఆయన కీలక పాత్ర పోషించారని, ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం ఈ అవార్డు ఇవ్వడం హర్షణీయమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సన్మాన గ్రహీత బిర్రు మహేందర్ మాదిగ మాట్లాడుతూ దళిత రత్న అవార్డు తనపై బాధ్యతను మరింత పెంచిందని అన్నారు. ఈ పురస్కారాన్ని అణగారిన వర్గాల పోరాటాలకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో సాగే ఏ పోరాటానికైనా తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. దళిత క్రైస్తవులకు తక్షణమే ఎస్సీ హోదా కల్పించాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ సాధన దిశగా తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మహేందర్ మాదిగకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# వానకాలం సాగుకు సిద్ధం కావాలి

**రైతు ముంగిట శాస్త్రవేత్తల అవగాహన కార్యక్రమం**



**ఎలుకతుర్తి/, మే 8 (జర్నలిస్ట్ వార్త):** వానకాలం సాగుకు రైతులు ముందస్తుగా సిద్ధం కావాలని వ్యవసాయ అధికారి మంద రాజకుమార్ సూచించారు. ఎలుకతుర్తి మండలం గోపాల్‌పూర్ గ్రామంలోని వెటర్నరీ ఆసుపత్రిలో శుక్రవారం వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో "రైతు ముంగిట శాస్త్రవేత్తలు" పేరుతో రైతుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. కే. గోపిక మాట్లాడుతూ యూరియా వినియోగాన్ని తగ్గించి అవసరమైన మేరకే ఎరువులు వాడాలని సూచించారు. పచ్చిరొట్ట ఎరువుల వినియోగం, సాగునీటి నిర్వహణ, రసాయనాల అధిక వినియోగంతో కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కల్పించారు. సాగుకు ముందు క్షేత్రస్థాయిలో మెళకువలు తెలుసుకుంటే పంట నష్టాలు తగ్గే అవకాశముంటుందని తెలిపారు. మృత్తిక శాస్త్రవేత్త డా. రవళి మాట్లాడుతూ పంటల్లో వచ్చే తెగుళ్లు, ఆశించే పురుగులు, వాటి నివారణ చర్యలపై రైతులకు వివరించారు. జీవ నియంత్రణ కారకాల వినియోగంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. మండల వ్యవసాయ అధికారి ఎం. రాజ్‌కుమార్ మాట్లాడుతూ వానకాల సాగుకు అవసరమైన జనుము, జీలుగు విత్తనాలు కావాల్సిన రైతులు మండల వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి తిరుపతి, ప్రోగ్రెసివ్ రైతు కిషన్‌రావు, సర్పంచ్ కర్రె లక్ష్మీ, వ్యవసాయ కళాశాల విద్యార్థులు తయ్యబ, తేజస్విని తదితరులతో పాటు 55 మంది రైతులు పాల్గొన్నారు.

# కనులపండువగా ఆదిత్య శారీ ఫంక్షన్

**హాజరైన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు బిర్రు మహేందర్ మాదిగ**



**పర్వతగిరి/మే8(జర్నలిస్ట్ వార్త):** పర్వతగిరి మండల పరిధిలోని ఏనుగల్లు గ్రామంలో శుక్రవారం సందడి నెలకొంది. మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా నాయకులు బిర్రు నర్సులయ్య మనవరాలు, మాసాని భాస్కర్-రాధిక దంపతుల ఏకైక కుమార్తె ఆదిత్య శారీ ఫంక్షన్ (ఓణిల పండుగ) వేడుక అత్యంత వైభవంగా, కనులపండువగా జరిగింది.

ఈ వేడుకకు దళిత రత్న అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి రాష్ట్ర నాయకులు బిర్రు మహేందర్ మాదిగ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరుకుల పరుగుల జీవితంలో బంధుత్వాలను, స్నేహ సంబంధాలను బలోపేతం చేసే ఇలాంటి శుభకార్యాలు ఆనందదాయకమని, సామాజిక ఐక్యతకు ఇవి దోహదపడతాయని పేర్కొన్నారు.

అనంతరం బిర్రు నర్సులయ్య మాట్లాడుతూ తమ కుటుంబ వేడుకకు విచ్చేసిన బంధుమిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరూ కుటుంబాల్లో ప్రేమానురాగాలను పంచుకుంటూ, బంధాలను గౌరవిస్తూ ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ వేడుకలో వరంగల్ జిల్లా జర్నలిస్టుల సంఘం ఉపాధ్యక్షుడు బిర్రు కరుణాకర్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు, నల్లబెల్లి వార్డు సభ్యులు గోలి సుధాకర్, కాంగ్రెస్ నాయకులు మరుపట్ల ప్రశాంత్ పాల్గొని చిన్నారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన ప్రముఖులు, కుటుంబ సభ్యులు, పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

# వరిలో సన్న రకాలతోనే సిరిసంపదలు

**దమ్మన్నపేటలో కర్షకులకు శాస్త్రవేత్తల దిశానిర్దేశం**







**వర్ధన్నపేట/మే 8(జర్నలిస్ట్ వార్త):** ప్రస్తుత సాగు పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న సన్న రకం వరి వంగడాలను సాగు చేయడం ద్వారా రైతాంగం అధిక లాభాలు గడించవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు డా. వీరన్న, డా. గొన్య నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని దమ్మన్నపేట రైతువేదికలో నిర్వహించిన రైతు వార్షికోత్సవంలో కర్షకులకు పలు సూచనలు చేశారు.

గ్రామ సర్పంచ్ దుబ్బ అంజయ్య అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో శాస్త్రవేత్తలు మాట్లాడుతూ సన్న రకాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహక ధర (బోనస్) అందిస్తున్నందున, రైతులు దొడ్డు రకాల కంటే సన్న రకాలపైనే మొగ్గు చూపాలని కోరారు. ముఖ్యంగా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వంగడాలను ఎంచుకోవాలని సూచించారు. తెలంగాణ సోనా, కె.ఎన్.ఎం-1638, జె.జి.ఎల్-1798: ఇవి 120 నుంచి 125 రోజుల్లో చేతికి వచ్చే స్వల్పకాలిక రకాలు. డబ్ల్యూ.జి.ఎల్-962, జైశ్రీరామ్: ఇవి 125 నుంచి 135 రోజుల మధ్యకాలిక రకాలు. సాంబా మహ్సూరి, సిద్ధి, హెచ్.ఎం.టి సోనా: ఇవి 140 నుంచి 150 రోజుల సుదీర్ఘ కాల పరిమితి గల రకాలు. ఈ రకాలను సాగు చేస్తే మార్కెట్‌లో మంచి ధర లభించడమే కాకుండా ప్రభుత్వ తోడ్పాటు అందుతుందని వివరించారు. వరితో పాటు అధిక సాంద్రత పత్తి సాగు, ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని శాస్త్రవేత్తలు కోరారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, భూసారాన్ని కాపాడే జీవన ఎరువులను వాడాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న భాస్వరాన్ని కరిగించే బాక్టీరియా, భూమిని శుద్ధి చేసే ఇతర మందులను రైతులు వినియోగించుకోవాలన్నారు. జాతీయ ఆహార భద్రతా మిషన్ సలహాదారు సారంగం మాట్లాడుతూ పప్పు దినుసుల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం అందించే రాయితీల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు